పరమ కరుణామయుడు అపార కృపాశీలుడు అయిన అల్లాహ్ పేరుతో

## 101. అల్ ఖారిఅహ్ సూరా పరిచయం

మక్కాలో అవతరించింది. 11 ఆయత్‌లు, ఒక రుకూ ఉన్నాయి.

ఈ సూరా అవతరణ మక్కాలో జరిగింది. తిరస్కారులు, ముష్రికులు ఖియామత్‌ను తిరస్కరిస్తున్నారు. దానికి జవాబుగా అల్లాహ్ సెలవిస్తున్నాడు. ఖియామత్ రావడం ఒక వాస్తవం. అది తప్పక వస్తుంది. అకస్మాత్తుగా వస్తుంది. ఇంటిలోనివారు రాత్రి తలుపులు మూసుకొని హాయిగా నిద్రపోతున్నప్పుడు రాత్రి రెండు గంటలకు ఎవరైనా అకస్మాత్తుగా తలుపు తట్టినపుడు అందరూ కంగారు పడతారు. తలుపులు ఎవరో పగలగొడుతున్నారని తలుపుల దగ్గరికి పరుగిడతారు. అదేవిధంగా ఈ ప్రపంచం యధాప్రకారం నడుస్తూ ఉండగా అకస్మాత్తుగా శంఖం ఊదబడుతుంది. భూమిలో తీవ్ర ప్రకంపం కలుగుతుంది. సూర్యచంద్రులు కాంతిహీనమయిపోతారు. పర్వతాలు రేణువులుగా అయిపోతాయి. మనుష్యులందరూ సమాధుల నుండి బయటకు వచ్చేస్తారు. ఈ సృష్టిలో ఏమి జరుగుతుందో అని అందరూ కంగారుపడతారు. ఆ రోజు పుణ్యం మాత్రమే పనికి వస్తుంది. అల్లాహ్ పాపపుణ్యాలను తూకం వేస్తాడు. ఎవరి పుణ్యాల త్రాసు బరువుగా ఉంటుందో అతడు స్వర్గంలో ప్రవేశిస్తాడు. అక్కడ అతడు సుఖభోగాలలో ఉంటాడు. ఎవరి పాపాల పళ్ళెం భారంగా ఉంటుందో అతడు నరకంలో వేయబడతాడు. అక్కడ వాడికి బాధాకరమైన శిక్ష పడుతుంది.

## 101. అల్ ఖారిఅహ్

**ఆయత్‌లు : 11** **అవతరణ : మక్కాలో**

పరమ కరుణామయుడు అపార కృపాశీలుడు అయిన అల్లాహ్ పేరుతో

(1) టకటకలాడించేది (2) టకటకలాడించేది ఏమిటి? (3) ఆ టకటక లాడించేది ఏమిటో తెలుసా నీకు? (4) అదే ఖియామత్. ఆ రోజు ప్రజలు చెల్లాచెదరయిన మిణుగురు పురుగుల్లా ఉంటారు. (5) పర్వతాలు ఏకిన రంగురంగుల దూది పింజాల్లా అయిపోతాయి. (6) ఎవరి సత్కార్యాల తక్కెడ పళ్ళాలు బరువుగా ఉంటాయో (7) వారు మనోరం జకమైన సుఖాలలో ఉంటారు. (8) ఇంకా ఎవరి సత్కార్యాల త్రాసు పళ్ళెరాలు తేలికగా ఉంటాయో (9) వారి నివాసం లోతయిన గొయ్యి అవుతుంది.

آياتها 11 — 101 سورة القارعة مكية — ركوعها 1

بِسْمِ اللّٰهِ الرَّحْمٰنِ الرَّحِيْمِ

اَلْقَارِعَةُ ﴿1﴾ مَا الْقَارِعَةُ ﴿2﴾
وَمَآ اَدْرٰىكَ مَا الْقَارِعَةُ ﴿3﴾
يَوْمَ يَكُوْنُ النَّاسُ كَالْفَرَاشِ الْمَبْثُوْثِ ﴿4﴾
وَتَكُوْنُ الْجِبَالُ كَالْعِهْنِ الْمَنْفُوْشِ ﴿5﴾
فَاَمَّا مَنْ ثَقُلَتْ مَوَازِيْنُهٗ ﴿6﴾
فَهُوَ فِيْ عِيْشَةٍ رَّاضِيَةٍ ﴿7﴾
وَاَمَّا مَنْ خَفَّتْ مَوَازِيْنُهٗ ﴿8﴾
فَاُمُّهٗ هَاوِيَةٌ ﴿9﴾

| | |
|---|---|
| (10) ఆ లోతయిన గొయ్యి ఏమిటో తెలుసా నీకు?<br>(11) ప్రజ్వరిల్లుతున్న అగ్ని అది. | وَمَآ أَدۡرَىٰكَ مَا هِيَهۡ ﴿10﴾ نَارٌ حَامِيَةُۢ ﴿11﴾ |

ع 1 11 26

1 – 11 వాక్యాలు

నరకాగ్ని ప్రపంచంలోని అగ్నికన్నా డెబ్బయి రెట్లు ఎక్కువ వేడిగా ఉంటుంది. హదీసులో చెప్పబడినట్లు ప్రపంచంలో మనిషి కాల్చే అగ్ని నరకాగ్ని యొక్క డెబ్బయ్యో భాగం. నరకాగ్ని ప్రపంచాగ్ని కంటే 69 రెంట్లు అధికం. (సహీహ్ బుఖారీ – హ.నెం. 3025)

వేరొక హదీసు ప్రకారం నరకం తన ప్రభువుకు – నాలోని ఒక భాగం వేరొక భాగాన్ని తినేస్తుంది, ఏం చేయను? అని ఫిర్యాదు చేసుకుంది. అల్లాహ్ దానిని (ఏడాదికి) రెండుసార్లు ఊపిరి పీల్చుకునేందుకు అనుమతి ఇచ్చాడు. ఒకసారి వేసవి కాలంలో, మరోసారి చలికాలంలో. చలి కాలంలోని అది పీల్చుకునే శ్వాసకు చలి తీవ్రత పెరుగుతుంది. వేసవి కాలంలో అది వదిలే శ్వాసకు వేసవి తాపం పెరుగుతుంది. (సహీహ్ బుఖారీ – హ.నెం. 3020)